క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



నగదు అందిస్తున్న పద్మశాలి జిల్లా సహాయ కార్యదర్శి జనార్దన్

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండ వెంకటేశం కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. శనివారం మృతుడి కుటుంబాన్ని పద్మశాలి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డా.మహేషుని జనార్దన్, జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం ఆంజనేయులు పరామర్శించి రూ.6 వేలు, ఇత్తడి వ్యాపారస్తులు సిద్దాల సత్తయ్య, ఎల్కుల స్వామి, ఎల్కుల మారుతిలు రూ.5వేలు, గ్రామానికి చెందిన కాసుగంటి కోటీశ్వర్ 25 కిలోల బియ్యం అందజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డిలు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

పరిహారం అందేలా చూస్తాం



సిద్దన్నపేటలో వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

నంగునూరు(సిద్దిపేట): వర్షాలతో పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయని, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి రైతులకు సహాయం అందేలా చూస్తామని మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఆయిల్ పామ్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి అన్నారు. శనివారం సిద్దన్నపేట గ్రామాన్ని సందర్శించి వరి పొలాలు, మామిడి తోటలకు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, అకాల వర్షానికి సిద్దన్నపేటలో వడ్లు, మామిడికాయలు నేల రాలాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పంట నష్టం వివరాలు సేకరించి నివేదిక అందజేయాలని మంత్రి ఆదేశించారన్నారు. వారి వెంట ఏఎంసీ చైర్మన్ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ తిరుపతి, పురేందర్, భాస్కర్‌రెడ్డి, మల్లేశం, సంతోష్, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొమురయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సిద్దన్నపేటలో మామిడి తోటలు, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు గ్రామంలో పర్యటించి పంట నష్టం వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయాలన్నారు.

ఫైలేరియా నివారణకు కృషి చేయాలి



వ్యాధిగ్రస్తులకు కిట్లు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

నంగునూరు(సిద్దిపేట): ఫైలేరియా వ్యాధి బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి సహాయం అందిస్తోందని ఎంపీటీసీ తిరుపతి అన్నారు. సిద్దన్నపేటలో శనివారం 18 మంది ఫైలేరియా వ్యాధి గ్రాస్తులకు ఎంఎండీపీ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. దోమల ద్వారా ఫైలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని, నివారణ కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పురేందర్, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, భాస్కర్, మల్లేశం, కోటిరెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఆరోగ్యసిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



రథోత్సవ వేడుకల్లో పీఏసీఎస్ చైర్మన్ శరత్‌రావు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో నిర్మిస్తున్న సహకార సంఘ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంఘం చైర్మన్ శరత్‌రావు సూచించారు. బెజ్జంకి సహకార సంఘం భవన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి రథోత్సవ వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ రమేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పోచయ్య, చెన్నారెడ్డి, భూమయ్య, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తండ్లాట

- వడ్డెర కాలనీలో అందని భగీరథ నీరు
- నిరుపయోగంగా ట్యాంకు
- పంటపొలాల బోర్ల వద్దకు పరుగులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పొలం నుంచి నీటిని తీసుకొస్తున్న కాలనీవాసులు

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రతీ రోజు నీటి కోసం పంట పొలాల్లో బోర్ల వద్దకు వెళ్తున్నాం. పనులు వదులుకొని నీటి కోసం తిరుగుతున్నాం. మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇన్నేళ్లలో ఎప్పుడు ఇలాంటి గోస చూడలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది.. కోహెడ మండలం సముద్రాల గ్రామ పరిధి వడ్డెర కాలనీకి చెందిన పల్లపు వెంకవ్వ.

ఇదీ పరిస్థితి..

- కోహెడ మండలంలోని సముద్రాల గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డెర కాలనీలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది.
- కాలనీలో ఉన్న మంచినీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.
- తాగునీటి కోసం ప్రతీరోజు పొలాల వద్దకు బిందెలు పట్టుకొని వెళ్తున్నారు. సుమారు సముద్రాల పరిధిలోని వడ్డెర కాలనీలో సుమారు 34 కుటుంబాలు 100 మంది జనాభా ఉన్నారు.
- గ్రామంలో పైప్‌లైన్, ట్యాంకుకు మరమ్మతులు చేయకపోవడంతో నీటి సమస్య తలెత్తింది.
- కాలనీలో 20ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది.
- గ్రామంలో మిషన్ భగీరథ నీటి కోసం పైప్‌లైన్ వేసి వదిలేయడంతో పనులు అసంపూర్తిగా మిగిలాయి.

ఇబ్బందిగా ఉంది



నీళ్ల రాక చాలా ఇబ్బందిగా ఉంది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. నీళ్ల కోసమే చుట్టు పక్కల పొలాల వద్దకు వెళ్తున్నాం. ఇళ్లలో శుభకార్యాలు జరపాలంటే సమస్యగా ఉంటుంది.

– దున్నపోతుల కనుకవ్వ

ట్యాంకర్లతో నీరు అందించాలి



మా కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కూలీ పనులు వదిలేసి నీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం. అధికారులు స్పందించి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలి.

– దండుగుల అయిలవ్వ

సమస్య పరిష్కరిస్తాం

కాలనీలో నీటి సమస్య ఉన్నట్టు మా దృష్టికి రాలేదు. మిషన్ భగీరథ ట్యాంకు నుంచి పైప్‌లైన్ వేసినా, నీటి సరఫరా ప్రారంభించలేదు. గ్రామంలో పర్యటించి నీటి సమస్యను పరిష్కరిస్తాం. ట్యాంకును రిపేరు చేసి నీటిని అందిస్తాం.

– ప్రియాంక, ఆర్‌డబ్ల్యూఎస్ఈ, కోహెడ

హోమియోపతి వైద్య శిబిరం



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రమేశ్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి నాలుగో వార్డులో ములుగు మండలం క్షీరసాగర్‌కు చెందిన హంస హోమియోపతి మెడికల్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరాన్ని గజ్వేల్ ఏసీపీ రమేశ్, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సందర్శించి వైద్య సేవల తీరును కొనియాడారు. శిబిరం నిర్వహణకు కృషి చేసిన వార్డు కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బొగ్గుల చందు, మర్కంటి వరలక్ష్మి పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి



చిన్నకోడూరులో దీక్ష చేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్లు లీక్ చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందోని వైఎస్సార్‌టీపీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎదుల్ల నర్సింహరెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ బోర్డు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే రద్దు చేసి, చైర్మన్, సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, చిరు, సలీమ్, మహేశ్, శంకర్ పాల్గొన్నారు.

దుబ్బాక: పేపర్ లీకేజీ ఘటనలో నిందితులను వెంటనే శిక్షించాలని వైఎస్సార్‌టీపీ దుబ్బాక నియోజకవర్గ ఇంఛార్జీ మాదాడి విజయ భాస్కర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌టీపీ పిలుపు మేరకు శనివారం దుబ్బాక పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరుద్యోగ యువకులకు న్యాయం చేయాలంటూ కళాశాల విద్యార్థులతో కలిసి ఒకరోజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే రద్దు చేసి దాని స్థానంలో మరో బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీ కేసును సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డబోయిన శ్రీనివాస్, యాదగిరి, ఎల్లం, మహేశ్, తదితరులున్నారు.

రాహుల్ సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేటకమాన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రాహుల్ గాంధీ సస్పెన్షన్‌ను నిరసిస్తూ సిద్దిపేట హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద కాంగ్రెస్ నాయకులు శనివారం నిరసన తెలిపారు. అనంతరం రాహుల్ సస్పెన్షన్ వ్యతిరేకిస్తూ మోదీకి రాసిన ఉత్తరాలను కాంగ్రెస్ నాయకులు పోస్ట్ ఆఫీస్‌లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రశ్నించిన గొంతుకలను అణచివేస్తూ, కార్పొరేట్ శక్తులను బీజేపీ పెంచి పోషిస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాహుల్ గాంధీ సస్పెన్షన్‌ను ఎత్తివేసి ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన కొనసాగించాలని లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అత్తు ఇమామ్, సతీశ్, చంద్రం, లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



బాధితురాలికి చెక్కు అందిస్తున్న సర్పంచ్ యాదగిరి

దుబ్బాక: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం అండగా ఉంటుందని సర్పంచ్ ముత్యంగారి యాదగిరి అన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన అల్వాల రమ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును శనివారం సర్పంచ్ యాదగిరి బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు నరేష్, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్



కమిటీ సభ్యులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ ప్రముఖులు

గజ్వేల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ కమిటీకి శనివారం పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో ఎర్రం శ్రీనివాస్ గెలుపొందారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా బచ్చు రవి, కోశాధికారిగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా దుర్గం స్వామి, సంయుక్త కార్యదర్శిగా కొడిశెట్టి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గాన్ని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితోపాటు పట్టణ ప్రముఖులు అభినందించారు.

బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

దుబ్బాక: దుబ్బాక సర్కిల్ పరిధిలో ఎవరైనా యువకులు ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక సీఐ మున్నూర్ కృష్ణ హెచ్చరించారు. దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఐపీఎల్ సీజన్లలో చాలా మంది యువకులు బెట్టింగ్‌లకు పాల్పడి తమ అమూల్యమైనా జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తేలికగా డబ్బులను సంపాదించాలనే ఆశతో చివరికి తమ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిసిన సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలను కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



హెల్పర్ మహేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని బండారుపల్లికి చెందిన విలేజ్ హెల్పర్ మహేందర్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలయ్యాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహేందర్‌ను దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు శనివారం పరామర్శించారు. గాయాలపాలైన మహేందర్‌కు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

ఆర్థికసాయం

మర్కూక్(గజ్వేల్): మర్కూక్‌కు చెందిన నీలం భిక్షపతి కూతురు నీలం సౌమ్య(19) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ భాస్కర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, ఎంపీటీసీ చైతన్యశంకర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 15వేల ఆర్థికసాయం అందించారు.

చలివేంద్రం ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సత్యం ల్యాండ్రిలో చలివేంద్రాన్ని కౌన్సిలర్ జుబేదాఖుతూన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాలుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్న సత్యం ల్యాండ్రి యజమాని శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏక్బాల్, శ్రీనివాస్, ప్రభాకర్, మల్లేశం, సత్యం పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులకు విరాళం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పద్మశాలి సంఘం భవన నిర్మాణ పనులకు బిల్ల అరుణ దామోదర్ దంపతులు 1.50లక్షల రూపాయల చెక్కును శనివారం సంఘ అధ్యక్షుడు బూట్ల సూర్యప్రకాశ్‌కు అందజేశారు. ఈ డబ్బులతో మార్కండేయ స్వామి ఆలయ ఆవరణలో షట్టర్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన అరుణ దామోదర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేశం, మచ్చ శేఖర్, నర్మద రవి, మల్లేశం, లక్ష్మన్, ప్రసాద్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి ఆలయ అభివృద్ధికి..

మద్దూరు(హుస్నాబాద్): యాదాద్రి ఆలయ అభివృద్ధికి దూల్మిట్ట మండల కేంద్ర ప్రజలు విరాళాలు అందించారు. గ్రామ సర్పంచ్ దుబ్బుడు దీపికవేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు రూ.65వేలు సమకూర్చి శనివారం యాదాద్రి ఆలయంలోని ఆలయ అధికారులకు అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధు, బీఆర్ఎస్ నాయకులు నాచగొని వెంటకట్‌గౌడ్, చేర్యాల మార్కెట్ డైరెక్టర్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



పనులను ప్రారంభిస్తున్న రజిత

హుస్నాబాద్: అధికారులు, కాంట్రాక్టర్లు అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మురికి కాల్వల నిర్మాణ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయిస్తూ, పట్టణాన్ని అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్ల నిర్మాణాలు, మురికి కాల్వల నిర్మాణాలను పూర్తిచేసి ఆదర్శంగా నిలుపుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొలిశెట్టి సుధాకర్, వార్డుప్రజలుపాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

చిన్నకోడూరు(సిద్దిపేట): తమకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిని కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని చిన్నకోడూరుకు చెందిన దళితులు శనివారం విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామానికి చెందిన 30 మంది దళితులకు గ్రామ శివారులో 40 ఏళ్ల క్రితం జాయింట్ ఫార్మింగ్ కో–ఆపరేటివ్ సొసైటీ ద్వారా భూమిని కేటాయించి పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి సాగు చేస్తున్నామన్నారు. కాగా సమీప రైతు దూల్మిట్ట కనకయ్య అక్రమంగా తమ భూమిలోకి చొరబడి హద్దురాళ్లను తొలగించి తమ భూమిలోకి వచ్చారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నాడన్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

విభజన హామీలను అమలుపర్చాలి

పీఎం మోదీ రాకను నిరసిస్తూ సీపీఐ రాస్తారోకో



హుస్నాబాద్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హుస్నాబాద్: రాష్ట్ర విభజన చట్ట హామీలను అమలు చేయకుండా హైదరాబాద్ పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ రాకను నిరసిస్తూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో మోదీ గోబ్యాక్ అంటూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, ఖాజీపేట రైల్వేకోచ్ వంటి హామీలను అమలుపరచకుండా తెలంగాణకు రావడం దురదృష్టకరమన్నాడు. రామగుండంలో సింగరేణిని ప్రైవేట్ పరం చేయబోమని హామీ ఇచ్చి మళ్లీ మూడు గనులకు టెండర్లకు పిలువడం ప్రధాని స్థాయి వ్యక్తి రాజకీయాల కోసం అబద్ధాలు ఆడడం ఘోరమైన తప్పిదమన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెంచి పేద ప్రజలపై ఆర్థిక భారం మోపాడన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సంజీవరెడ్డి, కోయ్యడ కొమురయ్య, నాయకులు రాజ్‌కుమార్, గూడ పద్మ తదితరులు ఉన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణకు దేశ ప్రధాని మోదీ రాకను నిరసిస్తూ శనివారం అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి కోమ్ముల భాస్కర్ ఆధ్వర్యంలో మోడీ గో బ్యాక్ అంటూ నల్లాబ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి కనకయ్య, కోమ్ముల పరశురాములు, మాచర్ల శ్రీనివాస్, చిట్టాల కోమురయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మండల కేంద్రం, చేర్యాల పట్టణంలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ గో బ్యాక్ అంటూ ప్లకార్డులు పట్టుకొని శనివారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, తేలు ఇస్తారి, వుల్లంపల్లి సాయిలు, బండకింది అరుణ్, పోలోజు శ్రీహరి, భాస్కర్, అందె అశోక్, ఈరి భూమయ్య, కుడిక్యాల బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా జగదేవ్‌పూర్ మండల రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఏల్లేశ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ నెల 11న జ్యోతిబాపూలే 197వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లో విశ్వేశరయ్య భవనంలో జరిగే జయంతి వేడుకల నిర్వహణకు వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రెండు వందల మందిని ఉత్సవాల కమిటీ నిర్వాహకులుగా నియమించారు. ఈ సందర్భంగా ఏల్లేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు, మంత్రి కమలాకర్, హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్సీ సారయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శిగా నవీన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శిగా కర్రోల నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలో కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశంలో ఈ మేరకు నవీన్‌ను జిల్లా కార్యదర్శిగా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. జిల్లాలో కుల వివక్ష లేకుండా చేయడంలో తనవంతు ప్రాత పోషించనున్నట్లు తెలిపారు. కుల, మత తేడా లేకుండా అందరం సమానమే అనే విధంగా ప్రజలు ఉంటే విధంగా కృషి చేస్తానన్నారు.

మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు మానుకోవాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటజోన్: బీజేపీ నాయకులకు నిరుద్యోగ ర్యాలీ నిర్వహించే అర్హత లేదని పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సిద్దిపేట నుంచే నిరుద్యోగ ర్యాలీ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక ఎంపీ హోదాలో ఆయన ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదని, కేంద్రం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. సిద్దిపేట శివార్లలో ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బండి సంజయ్ వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఆయన చర్యలతో తెలంగాణ అమరవీరుల స్తూపం మలినమైందని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావును విమర్శించడం దారుణమని, అవాకులు చెవాకులు మానుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం అంటేనే మంత్రి హరీశ్‌రావు అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు లోక లక్ష్మిరాజ్యం, బూర మల్లేశం, ఎల్లారెడ్డి, జువ్వన కనకరాజు, పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

హుస్నాబాద్: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటుగా ఆటలపై ఆసక్తి పెంచుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. శనివారం పట్టణంలోని నవ భారత్ హైస్కూల్‌లో స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడా స్ఫూర్తితో క్రీడారంగంలో రాణించాలన్నారు. ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గంగరవేని రాజు, వేల్పుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వినీష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రజిత